క్లుప్తంగా

సూర్యపీఠంలో ప్రత్యేక పూజలు



సూర్యపీఠంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమం

పార్వతీపురం: పట్టణంలోని రాయఘడ రహదారిలో ఉన్న సూర్యపీఠంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో రమాసత్యనారాయణ స్వామివారికి స్వర్ణ కమలార్చన, సత్యనారాయణ వ్రతాన్ని చేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్ప దీక్షధారులు స్వామివారిని దర్శించుకున్నారు. వేమకోటి వివేకానందశర్మ, టి.రామకృష్ణ అర్చకులకు వైదిక సహకారం అందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ నారాయణరావు, ట్రాఫిక్ ఎస్ఐ పాపయ్య అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ ఫోన్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పార్వతీపురంటౌన్: రైతులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని ఆర్‌కే బట్టివలస గ్రామంలో మంగళవారం రైతులకు పెసర, మినప విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు ప్రభుత్వం ద్వారా అందుకున్న విత్తనాల వినియోగించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అశోక్, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

350 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

మక్కువ: మండలంలో ఎర్ర సామంతవలస గ్రామంలోని క్రీస్తురాజు పుణ్యక్షేత్రంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, విన్సెంట్ డి పాల్ సౌజన్యంతో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 350 మంది శిబిరానికి తరలి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 150 మందిని కాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. అలాగే సుమారు వంద మందికి కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ పువ్వల జీవన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి అంచనా..



కాశీపేటలో పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, తదితరులు

సీతానగరం: మండలంలోని జోగింపేట గ్రామంలో గొర్లి సీతంనాయుడుకు చెందిన వరిపొలంలో మంగళవారం పంటకోత ప్రయోగాలు చేపట్టారు. 5''5 చ.మీ విస్తీర్ణంలో ప్రయోగం చేపట్టగా 16.090 కేజీల దిగుబడి వచ్చిందని అధికారులు తెలిపారు. అలాగే కాసాపేట గ్రామంలో రైతు వెన్నెల గౌరమ్మ పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 5''5 చ.మీ విస్తీర్ణంలో 16.050 కిలోల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరాకు సరాసరి 28 బస్తాలకు పైన దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్, మండల గణాంక అధికారి సతీష్, వీఏఏలు జగదీష్, రాకేష్, బ్యాంకు ఏజెంట్, రైతులు పాల్గొన్నారు.

మాలధారణం.. నియమాల తోరణం



సన్నిధానంలో పూజలు చేస్తున్న భక్తులు

- గ్రామాల్లో అయ్యప్ప దీక్షల కోలాహలం
- 41 రోజుల పాటు నియమనిష్టలతో హరిహర సుతునికి పూజలు
- ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యానికి దోహదం

బలిజిపేట: కార్తీకమాసం మొదలు మకర సంక్రాంతి వరకు అయ్యప్ప దీక్షల కోలాహలం కనిపిస్తోంది. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాలను మేళవింపజేసే అయ్యప్పదీక్ష ఎంతో పవిత్రమైనది. హరిహర సుతుడైన అయ్యప్ప కేరళ రాష్ట్రంలోని శబరిమల అడవుల్లో కొలువై ఉన్నాడు. స్వామి దర్శనానికి ముందు 18 మెట్లు అధిరోహించడం ద్వారా అజ్ఞానం తొలగి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షధారుల నమ్మకం. విలువలు పెంపొందించేందుకే అయ్యప్ప దీక్ష దోహదపడుతుంది. మాలధారణ, నల్లని వస్త్ర ధారణ, చన్నీటి స్నానం, విభూది, చందనం, కుంకుమతో అలంకరించుకోవడం ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై భస్మధారణ ఈశ్వరుడి సంకేతానికి, నుదుటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తుచేస్తాయి. అయ్యప్ప దీక్ష మనిషిలోని చెడుగుణాన్ని తొలగించి మంచి గుణాలను పెంపొందించి జీవనవిధానంలో మార్పు కనిపించేలా చేస్తుంది.

నియమాలు ఇలా..

అయ్యప్ప మాలను ఆలయంలో గురుస్వామి వద్ద లేదా ఇంట్లో మాతృమూర్తి వద్ద వేయించుకోవచ్చు. ప్రతిరోజు సూర్యోదయానికి ముందే పూజలు చేయాలి. సూర్యాస్తమయం తర్వాత పూజలు నిర్వహించాల్సి ఉంటుంది. నల్లటి దుస్తులు ధరించి 41రోజుల పాటు కఠిన నియమాలు పాటించాలి. రాత్రి వేళల్లో ఆలయాల్లోనే నిద్రకు ఉపక్రమించడం శ్రేయస్కరం.

ఆద్యంతం భక్తి పారవశ్యమే..

శబరిమల యాత్ర ఆద్యంతం భక్తి పారవశ్యమే. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఆలయం నుంచి ఇరుముడులు స్వీకరించి బృందంతో బయలుదేరుతారు. మొదటగా వావర్‌స్వామి కొలువైన ఎరిమేళికి చేరుకుంటారు. అక్కడ పేటతుల్లి ఆడి వావర్‌స్వామిని, పేటశాస్త్రిలను దర్శించుకుని పంబకు బయలుదేరుతారు. పంబానదిలో పుణ్యస్నానాలు ఆచరించి సన్నిధానంకు ఇరుముడులు మోసుకుంటూ స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో కొండ అంచున ఉన్న అప్పాచిమేడకు చేరుకుంటారు. అక్కడి నుంచి కొంతదూరం ప్రయాణిస్తే శబరీపీఠం కనిపిస్తుంది. అక్కడ కన్నె స్వాములు శరం పుల్లలను ఉంచుతారు. అక్కడి నుంచి స్వామి సన్నిధానానికి వెళతారు.

ఇరుముడి ప్రాధాన్యత..

అయ్యప్పస్వామిని నవవిధ సేవలతో కొలుస్తుంటారు. శ్రవణం, కీర్తనం, పాదసేవనం, అర్చనం, నమస్కారం, ధ్యానం, స్మృతం, ఆత్మనివేదనలతో కొలుస్తుంటారు. అయ్యప్ప దీక్షలో ఇరుముడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇందులో రెండు ముడులు ఉంటాయి. ముందున్న ముడిలో అయ్యప్ప స్వరూపమైన ముద్ర, కొబ్బరికాయ స్వామికి సమర్పించే వస్తువులను ఉంచుతారు. కొబ్బరికాయను నేతితో నింపుతారు. నెయ్యి జ్ఞానానికి ప్రతీకంగా చెబుతారు. కొబ్బరికాయకు బిగించే కార్క్‌ను వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడతారు. ఆపైన కాయకు ఆత్మ అనే లక్కతో సీలు వేస్తారు. జ్ఞానం అనే నెయ్యితోనే అయ్యప్పకు అభిషేకం చేస్తారు. మనలోని జ్ఞానాన్ని సంపూర్ణంగా స్వామి అయ్యప్పకు నిండు మనస్సుతో అర్పించుకున్నట్లుగా భావించడమే అర్థం. దీన్నే ఆత్మనివేదన అంటారు.

పాపాలు తొలగిపోతాయని నమ్మకం



అయ్యప్ప మాలధారణతో పాపాలు తొలగిపోయి, సన్మార్గంలో నడిచేందుకు అవకాశాలుంటాయని నమ్మకం. చాలామందిలో మంచి పరివర్తనకు నాంది పలుకుతుంది. 41రోజులు కఠిన దీక్షలో ఉండి ఇరుముడిని కట్టుకుని పంబానదిలో స్నానం చేస్తే చేసిన పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

– తిరుపతి స్వామి, తుమరాడ, బలిజిపేట మండలం

ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది



మాలాధారణ వలన ఆధ్యాత్మిక చింతన పెరిగి, భగవన్నామస్మరణలో నిమగ్నమవుతారు. 41రోజుల దీక్ష అనంతరం వారిలో కొంతమేర మార్పు వస్తుంది. మానవతా విలువలు పెరుగుతాయి. దైవారాధనతో వారి జీవితం సాఫల్యం అవుతుంది.

– కె.గోపాలకృష్ణ, గురుస్వామి, వెంగాపురం, బలిజిపేట మండలం

పవిత్రమైన పదునెట్టాంబడి..

స్వామి సన్నిధిలో ఉండే 18 మెట్లను అవతార పురుషుడు పరుశురాముడు నిర్మించారని వాడుకలో ఉంది. అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయుడు, కుబేరుడు, ఈశాన్యుడు, రెండు యోగములైన కర్మయోగం, జ్ఞానయోగంతో పాటు విద్య, అవిద్య, జ్ఞానం, అజ్ఞానానికి రూపాలుగా ఈ 18 మెట్లను ఏర్పరిచారు. సన్నిధానం చేరిన భక్తులు 18 మెట్లు ఎక్కేముందు కొబ్బరికాయను కొట్టి ఎక్కుతారు. స్వామి దర్శనం అనంతరం ఇరుముడిని గురుస్వామి సాయంతో విప్పవలెను.

ఆరోగ్య ప్రయోజనాలు..

41 రోజుల దీక్ష ఆరోగ్యం మెరుగుపరిచేందుకు దోహదపడుతుంది. భక్తి భావంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది అయ్యప్ప దీక్షలను తీసుకుంటారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీక. సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానం నాడీ వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. నేలమీద పడుకోవడం కండరాల పటిష్టతకు, రక్తప్రసరణ మెరుగునకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనస్సు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగతాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం వలన ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయ్యప్పమాల ధరించిన భక్తులు కార్తీకమాసం మొదటిరోజు నుంచి మకర సంక్రాంతి వరకు భజనలు చేస్తూ స్వామి కృపకు పాత్రులవుతారు.



అయ్యప్ప పూజలో పాల్గొన్న స్వాములు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పార్వతీపురం: మండలంలోని ఎస్.ములగ గ్రామంలో అయ్యప్ప పడిపూజను అయ్యప్ప భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని బంకపల్లి రామకృష్ణ స్వామి ఇంట్లో అయ్యప్పలు పూజలు, భజనలు చేశారు. దుష్టశక్తులను సంహరించడానికి అయ్యప్పస్వామి ఉపయోగించిన 18 ఆయుధాలను 18 మెట్లుగా భావించి మెట్లకు పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి

- పీడీఎస్ఓ పిలుపు

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్ఓ సభ్యులు స్వామి పిలుపునిచ్చారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కరువు, వలసలు–విద్య, ఉపాధి రంగ సమస్యలు–కర్తవ్యాలు'అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్యం అనంతరం ఏర్పాటైన ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఆ కారణంగానే ఈ ప్రాంతంలో ఇప్పటికీ వలసలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్‌ను, సెంట్రల్ యూనివర్సిటీని, విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలన్నారు. మూతపడ్డ జూట్, చెక్కర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులను కేటాయించాలన్నారు. ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. విజయనగరంలో జరగనున్న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సుకు ప్రారంభకులుగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు, ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వక్తలుగా కేంద్ర–రాష్ట్ర మాజీ సలహాదారు వైవీఎస్ మహదేవన్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ సభ్యులు స్వామి, వాసు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కన్నబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలో నారాయణపురం, పెద్దింపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరామర్శించారు. నారాయణపురంలో డి.కన్నబాబు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా పెద్దింపేటలో మాజీ ఆర్ఐ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎం.సత్యనారాయణ కుమార్తె మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జడ్పీటీసీ ఎ.రవికుమార్, జి.శ్రీరాములునాయుడు, జి.పకీరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ అయ్యాకే మందులు ఇవ్వాలి

- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్



వైద్యపరీక్షలపై ఎంఎల్‌హెచ్‌పీని ప్రశ్నిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్

సీతానగరం: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ కేవీఎస్ అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని సూరంపేట, కాశీపేట గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలు, రోగనిర్ధారణ పరీక్షలను, వైద్య పరికరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగ నిర్ధారణ అయ్యాకే రోగులకు మందులు అందజేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన అన్ని రకాల మందులు, వైద్య పరికరాలను సమకూర్చడం జరిగిందన్నారు. ఇంకా ఏమైన పరికరాలు, మందులు అవసరమైతే ఆ మేరకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యులకు సూచించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహనరావు, పీహెచ్‌సీ డాక్టర్ ఉషాను ఆదేశించారు.

సంక్రాంతి సెలవుల జీతాన్ని ఇవ్వాలి

పార్వతీపురంటౌన్: కేజీబీవీల్లో పనిచేసే సిబ్బందికి సంక్రాంతి సెలవుల జీతాన్ని ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది డిసెంబరు 20 నుంచి 2024 జనవరి 10 వరకు కేజీబీవీ సిబ్బంది సమ్మెలో ఉన్నారని, జనవరి 11 నుంచి 20 వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చారని తెలిపారు. జనవరి 8,9 తేదీల్లో సిబ్బంది విధుల్లో చేరినప్పటికీ వారికి వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. అన్ని జిల్లాల్లో సిబ్బందికి వేతనాలు చెల్లించారని, కేవలం పార్వతీపురం మన్యం జిల్లాలో మాత్రమే వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి చొరవ చూపి తక్షణమే వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

పార్వతీపురంటౌన్: రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసులశాఖ అధికారి డి.రామగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రవాణా శాఖ సిబ్బంది సహకారంతో ఈనెల 12 నుంచి 14వరకు సాలూరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు, శిరస్త్రాణం ఆవశ్యకతను తెలియజేయనున్నట్లు తెలిపారు. 13న ఉదయం 9 గంటలకు పాలకొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో, మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురం కలెక్టరేట్ ఆవరణంలో, 14న కురుపాం మండలం గొటివాడ గ్రామంలో ఉదయం 10 గంటలకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రతి పౌరుడి ఆరోగ్య భద్రతే ఆయుష్మాన్ భారత్ లక్ష్యం



మాట్లాడుతున్న ఆయుష్మాన్ భారత్ పీఓ డాక్టర్ నరేష్

సీతానగరం: దేశంలోని ప్రతీ పౌరుడికి ఆరోగ్య భద్రత కల్పించడమే ఆయుష్మాన్ భారత్ పథకం లక్ష్యమని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ ఏపీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేష్ అన్నారు. మండలంలోని నిడగల్లు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలను పరిశీలించారు. రోగులకు అందించాల్సిన వైద్య సేవలపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ క్లస్టర్ ఇన్‌చార్జి డాక్టర్ విజయమోహన్, కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి, ఈఓ జి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, సూపర్‌వైజర్ గోపాలరావు, ధరణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

హెల్మెట్ బరువు కాదు బాధ్యత: సీఐ



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సీఐ అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సెట్విజ్, నీడ్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ.. హెల్మెట్‌ను బరువుగా భావిస్తారని, కానీ అది మన ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని గుర్తించాలని కోరారు. యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు, సెట్విజ్ సీఈఓ, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల సభ్యులంతా అక్షరాస్యులుగా మారాలి



బలిజిపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి



సీతానగరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలు అక్షరాస్యులుగా మారాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు అధ్యక్షతన వీఓఏలకు మంగళవారం నిర్వహించిన శిక్షణా తరగతులను ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ సంఘం నుంచి నిరక్షరాస్యులైన 30 మందిని ఎంపిక చేసి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మండలంలో మొదటి విడతగా 1430 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వారికి చదవడం, రాయడం వంటివి నేర్పించేందుకు వెలుగు నుంచి 143 మంది వలంటీర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. డిసెంబరు నెల నుంచి మూడు నెలల పాటు అక్షర వెలుగు(ఉల్లాస్) కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీరాములు, వెలుగు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

బలిజిపేట: మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులైన సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వలంటీర్లు, బుక్ కీపర్లకు, సీసీలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల్లో ఉండే నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు 'ఉల్లాస్' కార్యక్రమాన్ని అమలుచేస్తోందన్నారు. గ్రూపులో చదువుకునే సభ్యులు వలంటీర్లుగా పనిచేసి నిరక్షరాస్యులైన సభ్యులకు చదవడం, రాయడం వంటివి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ పుష్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి



సీతానగరం: లచ్చయ్యపేటలో కొలువైన వేంకటేశ్వరస్వామి



సీతానగరం: పూజల్లో పాల్గొన్న భక్తులు

కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద అఖండ దీపారాధన చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మక్కువ: శివకేశవులను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంగనాయుడు



పార్వతీపురం: సంగంవలసలో ఏకాదశి పూజల్లో పాల్గొన్న మహిళలు



బలిజిపేట: వెంగాపురం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు